# పాపపుణ్యాలు

(కథానిక)

తెన్నేటి అహల్యాదేవి

రాత్రి ఎనిమిది గంటలైంది. కాలేజీ హాస్టలు చాలవరకూ మాటు మణిగింది. కొన్ని గదుల్లో టేబిల్ లైట్లు ముందు తెరచిన పుస్తకాలమీద, అప్పుడే ప్రాణాచారాలు పడివున్నారు విద్యార్థులు. కొద్దిమంది బుద్ధిమంతులు మాత్రం 'లైట్ ఆఫ్' చేసి యథోచితంగా మంచాలమీదనే నిద్రిస్తున్నారు. ఒక గదిలో రసాయన శాస్త్ర పాఠ్యపుస్తకాన్ని బోర్లా పడుకోబెట్టి దానిచుట్టూ చేరిన తర్క శిఖామణుల్లో, సురయ్యా నర్గీసుల తరతమాలమీద తర్జన భర్జనలు సాగుతున్నై.

అది నిరంజన్ గది. అతడూ, చంద్రశేఖర్ చెరోమూలా కూర్చొని ఏకాగ్రతతో ఏవో పుస్తకాలు చదువుకుంటున్నారు. ఉన్నట్టుండి నిరంజన్ అన్నాడు, "ఈ 'పాప' మంటే ఏమిటో అసలు?"

ఆశ్చర్యంతో తలయెత్తి, అతనికేసి చూస్తూ అన్నాడు చంద్రశేఖర్, "పాపమంటే ఏమిటా? బాగుందోయ్ నిరంజన్! ఇన్నాళ్ళదాకా నీవు పాపమంటేనే తెలియకుండా వున్నావా?'

"పోనీవోయ్! ఏం మునిగిపోయింది? ఇప్పుడు చెప్పరాదూ తెలుసుకుంటాను."

"ఏముంది? చాల మామూలు సంగతే అది! చెడ్డపని చేస్తే పాపమంటారు."

"ఆహాఁ, అంతటితో కథ ముగియదు మహాత్మా! చెడ్డపనులు చెయ్యటమే పాపమైతే, వేటిని చెడ్డ పనులనాలీ అనే ప్రశ్న వెంటనే పుట్టుకొస్తుంది. అబద్ధమాడటం చెడ్డపని; కనుక అబద్ధమాడటం పాపం, అని నీవంటావు. దానికి సమాధానమిది: కొన్ని పరిస్థితుల్లో అసత్యమాటడం చెడుకాదు. పైపెచ్చు ఒక్కొక్కప్పుడు మంచే కావచ్చు. జీవితాల్లో ఇలాంటి సందర్భాలు ఎన్నో వచ్చాయి; వస్తూవుంటాయి. అప్పుడది పాపం ఎలా అవుతుంది?"

"అసత్య మాడటం ఏ పరిస్థితుల్లోనూ పుణ్యమనిపించుకోలేదు."

"పుణ్యమని నేననడంలేదు. పాపం మాత్రం కాదంటున్నాను. ఒకవ్యక్తి అపరాధం చేస్తాడు. హృదయపూర్వకంగా నిజమైన పశ్చాత్తాపం చెందుతాడు. అపరాధానికి దండిస్తే సర్వనాశన మైపోయే పరిస్థితి అతనిది. పిల్లా జెల్లా దిక్కుమాలిన పక్షులై పోతారు. ఎవరైనా అతణ్ణి ఒక్క అబద్ధమాడి దండననుండి తప్పిస్తే— ఆ కాపాడిన వాడు పాపం చేసినట్టేనా?"

"నిస్సందేహంగా! దండనే లేకపోతే అపరాధాలకి అది ప్రేరణ ఔతుంది. దుస్సాహసాన్ని అది పురికొల్పుతుంది. అదే—అలాంటిదే మరొక అపరాధాన్ని చేయిస్తుంది చివరికి."

"సరే! ఒప్పుకుందాం. కాని వాడు తిరిగి ఏ అపరాధం చెయ్యలేదనుకో— ముందే చెప్పానుగా నిజమైన పశ్చాత్తాపమని—అప్పుడు?"

"ఐనాకూడా అది పాపమే. చెడు ఏనాటికీచెడే!" కొంచెం ఆలోచించి అన్నాడు శేఖర్.

"అదిగో! అక్కడే మనకి అభిప్రాయ భేదం. నీవు పాపాన్ని పనికే ఆరోపిస్తావు. నేను దాని ఫలితాన్నిబట్టి పాపం అంటాను. ఏదైనా పని యొక్క ఫలం, తనకిగాని, ఇతరులకుగాని, ఏ విధంగానూ హానికల్గించనంతవరకు ఆ పనిని పాపం అంటానికి వీల్లేదు."

"బాగు బాగు! అలాగైతే ఏపనినీకూడా 'ఇది పాపం' అని ముందే నిర్ణయించ లేమన్నమాట. అదేనా నీ తర్కం!"

"అదెలా ఔతుంది! కొన్ని కార్యాలు స్వాభావికంగానే పాపు క్రిందికి వస్తాయి. ఉదాహరణకి: దొంగతనం, వ్యభిచారం, జూదం మొదలయినవి వున్నాయి. వీటివల్ల ఎప్పుడూ ఎవరికో ఒకరికి హాని చేకూరడం తథ్యం."

"ఊఁ! పోనీవోయ్, ఇది నీకూనాకూ మెదడుకందే విషయంకాదు. ఏ వేదాంతులో తంటాలు పడాలిన పనులు."

"వేదాంతులు మాత్రం మనలాంటి మనుష్యులు కారా?"

"మనుష్యులేకాని మనలాంటివారు కారు"

"ఏమో, వేదాంతులేమైనా చెప్పనీ. పాపానికి నా పరిభాష మాత్రం ఇంతే. మనకో ఇతరులకో ఏవిధంగానైనా హానికల్గించే కార్యమే పాపం."

"ఏ విధంగానైనా—అంటే నీ తాత్పర్యం?"

"శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, ఇలానే..."

"ఏమోనోయ్, నీ పరిభాషను తర్కంతో ఖండించలేను. కాని నా అంతరాత్మకి మాత్రం ఆ పరిభాష దోషయుక్తమే అనిపిస్తోంది. ఈ విషయం నీకెప్పుడో అనుభవంలోకాని అవగతంకాదు."

"చూద్దాం. కాని నా అభిప్రాయం మార్చుకోవలసిన అవసరం ఉండదనే నా దృఢవిశ్వాసం. ఒకవేళ అలా ఋజువైతే నాతప్పు ఒప్పుకుంటాను."

తర్కం ముగిసింది. తర్వాత కాసేపు ఇద్దరూ మళ్ళీ చదువులో మునిగారు. సుమారు తొమ్మిదిన్నర అయింది. చంద్రశేఖర్ పుస్తకమూశాడు. "అబ్బ! ఇక నిద్రవస్తోందోయ్! నాగదికి పోయి పడుకుంటాను...గుడ్ నైట్" అన్నాడు ద్వారం వైపు నడుస్తూ.

బయటిదాకా సాగనంపి, ద్వారం బంధించి వచ్చి, 'లైట్ ఆఫ్' చేశాడు నిరంజన్. కిటికీ దగ్గరికివచ్చి గాజు తలుపులోగుండా బయటికి చూశాడు. రోడ్డుకి అవలివైపున భవనం. దాని రెండో అంతస్తు గది ఒకటి సూటిగా తన కిటికీకి ఎదురుగా వుంటుంది. గదిలో ఇప్పుడింకా విద్యుద్దీపం వెల్గుతూనేవుంది. నిరంజన్ చూచాడు, ఒక ఇల్లాలు—నవయువతి—స్వేచ్ఛగా పడుకుని వుంది. తన కళ్ళయెదుట—కేవలం పది పన్నెండు గజాల అవల. తదేక దీక్షతో ఏదో పుస్తకం చదువుకుంటోంది. హఠాత్తుగా ఆమె పక్కమీద దొర్లి ఒళ్లు విరుచుకుంది. బంగారు ఛాయగల ఆ సుందరి వక్షస్థలంమీది ఆచ్ఛాదన కొంత తొలగింది. ఈ దృశ్యాన్ని అతి ఉత్సాహంతో తిలకించాడు నిరంజన్. ఎంతసేపో అంతు తెలియదు; కడకామె దీపమార్పి పడుకోగానే ఇతడూ కూడావచ్చి పడుకున్నాడు. తానలా చూడటం పాపం కాదూ! అంతరాత్మ గద్దించింది. "ఉహ్ ఎవరికేం నష్టం? అహంకారం వాదించింది. పాపానికి తన నిర్వచనం గుర్తుకొచ్చింది. నిద్రతో బరువెక్కిన అతని కనురెప్పలు విజయగర్వంతో వ్రాలాయి.

* * *

గ్రహపాటున వీడో ఒక నాడైంది పొరపాటు;. ఆపైన అహంకారపు తోడ్పాటు. కడకు తేలింది అలవాటు!

ఇట్టి 'సువర్ణావకాశాలు' లభించినప్పుడల్లా, ఎదుటి భవనంలో కులాంగనల్ని చూస్తూ, రూపామృతపానం చేయడం చివరికి నిరంజన్‌కు ఒక వ్యసనంగా పరిణమించింది. అలాంటి దృశ్యమేదీ లభించని నాడు ఒక దినం వ్యర్థమై పోయిందనుకునేవాడు.

ఆనాడాదివారం. మధ్యాహ్నవేళ. గదిలో ఏదో నవల చదువుతూ కూర్చున్నాడు నిరంజన్. మధ్యమధ్యలేచి కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు. 'ఆ గదులు'శూన్యంగానే వుండటంచూచి నిరాశతో మళ్ళీవచ్చి కుర్చీలో కూలబడి చదువుకుంటున్నాడు. ఇలాంటి కొన్ని గుంజీల తర్వాత చివరికి సాఫల్యం లభించింది. ఒక యువతి వచ్చింది. మంచంమీద పరుండి ఎదురు గదిలో సాక్షాత్కరించింది. ఇంకేముంది? పుస్తకాన్ని మంచంలో జారకొట్టి కిటికీకి కన్నుచేర్చాడు. తదేకదీక్షతో అజాగ్రత్తలోనున్న ఆ రూపాన్ని చూస్తూ తన్ను తానే మరచిపోయాడు నిరంజన్.

ఎంత సమయం అలా గడచిపోయిందో గాని, తన వెనుకనుండి, "ఛీ" అని దగ్గరగా గట్టిగా వినిపించేసరికి, ఉలిక్కిపడి వెనుదిరిగాడు. ముఖాన నెత్తురు చుక్కలేదు. ఎట్టయెదుట చంద్రశేఖర్ నిల్చొని వున్నాడు. ఒకసారి తన గది తలుపుకేసి చూశాడు నిరంజన్. సిగ్గు, ఆశ్చర్యం పెనవేసుకున్న చిరునవ్వుతో అన్నాడు:

"అరె! నువ్వెక్కణ్ణించీ ఊడిపడ్డావోయ్?" నియమానుసారం, ఈ మహాకార్యం చేసేముందు ఎప్పటిలా గదితలుపు గడియ వేయటం మర్చిపోయినందుకు బాధపడ్డాడు లోలోపల.

చంద్రశేఖర్ చెప్పాడు, "నిద్రపోతున్నావేమోనని మెల్లగా తలుపు తోశాను. అంత దీక్షగా ఏంచూస్తున్నావోనని నిశ్శబ్దంగా నీ వెనుక వచ్చి నిలబడ్డానుగాని ఊడిపడలేదు మహాత్మా!"

"సరే! ఏంచూశావు కిటికీలోంచి?" అన్నాడు నిరంజన్ తెచ్చుకున్న దర్పంతో.

"ఏంచూశావా? ఏ పెద్దమనిషీ చూడకూడనిదీ, ఏది చూస్తే పాపం అంటుకుంటుందో..."

నవ్వుతూ మాటకట్టడం వచ్చాడు నిరంజన్.

"నువ్వు-వట్టి మూర్ఖుడవోయ్!" అన్నాడు మంచంమీద కూర్చుంటూ.

"అజాగ్రత్తలోవున్న పరస్త్రీలను కన్నుపొడుచుకుని కక్కుర్తిపడి చూడటం పాపం కాకపోతే పుణ్యమౌతుంది కాబోలు!"

"పుణ్యం కాకపోవచ్చు. కాని పాపం మాత్రం కాదు."

"ఆహా! బాగుంది. ఇలాంటివన్నీ పాపం కాకపోతే ఇక లోకంలో ఏది పాపమో నాకు బోధపడటంలేదు."

"నీకో ఇతరులకో అపకారం కల్గించేది పాపం. అంతేకాని..."

అసహ్యంతో ముఖం చిట్లించుకుని, చంద్రశేఖర్ అందుకున్నాడు, "ఏడ్చినట్లుంది నీ సిద్ధాంతం. బయలుదేరావు పెద్ద వేదాంతివి. పరాయి వధువులను దొంగతనంగా పారచూడటం. పైగా ఈ సిగ్గులేని సిద్ధాంతాలు!"

"ఇదుగో శేఖర్! తిట్టదలచుకుంటే ఇష్టం వచ్చినట్టు దిట్టంగా తిట్టు. అభ్యంతరంలేదు. కాని మెదడంటూ వుంటే నామాట లాలోచించు. జగత్తులో సుందరవస్తువు లెందుకున్నాయి? సౌందర్యాన్ని అవలోకించడానికే ఈశ్వరుడు మనకీ నేత్రాలిచ్చింది. ఏ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ ఎ జాయ్ ఫర్ ఎవర్ అన్నాడు మహాకవి కీట్సు. సుందర పుష్పాలూ లతలూ, సుందర సరోవరాలూ పర్వతాలవంటి దృశ్యాల్ని చూసే అధికారంవున్న మానవుడికి స్త్రీ సౌందర్యాన్ని చూచే అధికారం ఎందుకు లేదు?"

"శభాష్ తొండ ముదిరింది...మహాత్మా, అది నీ అధికారమేనని నిజంగా నీకు విశ్వాసముంటే, ఈ చాటు మాటుగా చూడటాలెందుకు? కిటికీ తెరు; ముందుకు నిలబడు; హాయిగాచూడు. అప్పుడుంటుంది మజా."

"అలా కాదు. ఆ విధంగా చూడటం పాపమౌతుంది."

"ఈ విధంగా చూడటం పాపం కాదా!"

కాదు. ఎందుకంటే నువ్వు చెప్పినట్టు చూశామనుకో. ఆవిడకది ఆటంకం కల్గిస్తుంది. చెడ్డగా తోస్తుంది. మనస్సు బాధపడుతుంది. అది పాపం క్రిందకే వస్తుంది. నేం చెప్పిన విధంగానైతే, నా నేత్రాలకు, ఆత్మకు సుఖం లభిస్తోంది. ఆమెకా ఏ హానీ కల్గటం లేదు—ఇందులో పాపం అనే ప్రశ్నే లేదు. తెలిసిందా."

చంద్రశేఖర్ నవ్వాడు, "శబాష్! అపూర్వ సిద్ధాంతం. విచిత్ర తర్కం...ఒకమాట. ఆ ఎదురు గదిలో మన అక్కచెల్లెళ్లో ఇంటి కోడళ్లో అదే దశలో వుంటారనుకో. ఎవడో తుంటరి ఇలాగే నీ గదిలోంచి చూస్తాడని భావించు. ఎలా వుంటుంది నీ మనసుకి?"

"చెప్పానుగదా! అలా మనల్ని చూస్తున్నారని మనకి తెలియనంతవరకూ మనమనస్సుకి ఏ బాధా చూసేవాడికి ఏ పాపమూ లేదు. ఎవరైనా కానీ. ఇంతకూ, నీవు ఏదో కుర్రాడివి. మెదడు ఉపయోగించాలోయ్ దేనికైనా! వట్టి బూజుపట్టిన బుర్రలా వుంటే లాభంలేదు."

"దేవుడు మేలుచేస్తే, నీకంటే మూడు నాలుగేళ్లు పెద్దవాణ్ణే కాని...సరే, కుర్రవాణ్ణే అను. ఇబ్బందిలేదు. ఇకపోతే మెదడు ఉపయోగించటం సంగతి —— అర్ధనగ్నదశలో వుండే పరస్త్రీలను చూడడమనే దుష్కార్యాన్ని తర్కంద్వారా సత్కార్యంగా నిరూపించే సామర్థ్యం ఇంకా నా మెదడుకు రాలేదు. అది నీకే తగిపోయింది. తనకో ఎవరికో హానికల్గించేదే పాపమని నేను ఎన్నటికీ ఒప్పుకోలేదు. ఫలితం కల్గలేదని మనం చేసేది పాపం కాకుండాపోను. అనేకసందర్భాల్లో మన చేతల ఫలితం ఆలస్యంగా కల్గుతూంటుంది. కాని కల్గటం మాత్రం అనివార్యం."

"హే మహానుభావా! ఐతే, నాకు ఈ పాపానికి ఏంఫలితం కల్గుతుందో ఎప్పుడు కల్గుతుందో చెప్పగలరా?"

"సమయం వచ్చినప్పుడు అది నీకే తెలుస్తుంది. కాని ఈ దురభ్యాసాన్ని మానకపోతే దాని దుష్పరిణామం నప్పక అనుభవించాల్సివుంటుంది. స్నేహితుడుగా నేను చెప్పాల్సింది చెప్తున్నాను."

"మంచిది. నేనూ చూస్తాను. తమ ఈ జోస్యంలో పస ఏమిటో తేలుస్తాను."

* * *

చంద్రశేఖర్ వలెనే క్రమంగా మరో హాస్టల్ విద్యార్థికూడా నిరంజన్ చర్య కనిపెట్టాడు. అతడి పేరు మనోహర్. బిరుసు తనానికి హాస్టల్లో ప్రసిద్ధి. అతడు తరచు నిరంజన్ గదికి వస్తూండేవాడు. ఎప్పుడో ఎలానో అతనికూడా ఆ దృశ్య సౌభాగ్యం లభిస్తూండేది. నిరంజన్ భోజనానికివెళ్తే గదితలుపు దగ్గరగావేసి పోతాడు. లేదా తాను అతని గదిలోనేవున్న సమయంలో, నిరంజన్ ఏ కాలకృత్యాలకో బయటికి పోతాడు. మనోహర్ అలాంటి మంచి తరుణం ఎన్నడూ మించి పోనీడు.

ఒకనాడు మనోహర్ వచ్చేసరికి, గది శూన్యంగావుంది. సరాసరి కిటికీదరికి పోయినాడు. కళ్లు పొడుచుకు చూస్తూ, ఎదుటి గదిలోని యువతీ సౌందర్య సందర్శనంలో మునిగి తేల్తున్నాడు మనోహర్. అకస్మాత్తుగా నిరంజన్ తన గదిలోకి ప్రవేశించాడు. వెంటనే అతనికి సంగతి అర్థమైంది. కొంచెం కర్కశ స్వరంతో అన్నాడు, "ఏం చూస్తున్నావోయ్ అక్కడ?"

"ఆ! ఏం లేదు." అదరిపడి, వెనుకకు తిరిగి తమాయించుకుంటూ అన్నాడు మనోహర్, "ఊరికేనే రోడ్డుమీది జనప్రవాహం తిలకిస్తున్నాను. నువ్వొచ్చేదాకా ఏదో కాలక్షేపం..."

"రోడ్డుమీది జనప్రవాహం చూడాలంటే, నీ గదికేపోయి చూసుకోవచ్చు."

"ఎందుకలా ఇదౌతావు? ఊరికే నుంచుని చూస్తూంటే ఏంపాపం చేశానని!"

"అలాంటి పిచ్చిమాటలు నాకు గిట్టవు, తెలిసిందా? ఎదురింట్లో మంచి కుటింబీకులున్నారు. వాళ్ళు చూస్తే ఏమనుకుంటారు!"

"కిటికీ తలుపులు వున్నైగదా, వాళ్ళెలా చూస్తారు?"

"ఏమో, చూడవచ్చు. మర్యాదలేకుండా ప్రవర్తించకు—ఇతరుల గదికివచ్చి."

"అవునయ్యా! గంటలకొద్దీ నిలబడి నువ్వు తెగ చూచినా పర్వాలేదు. వాళ్లేంచూడరు. నేను మాత్రం ఒక్కనిమిషం నుంచుంటే వాళ్ళుచూస్తారు కదూ? నిజమే గురూ! నిజమేమరి!"

నిరంజన్ క్రోధస్వరంలో "ఆపు అంతటితో! మాటలు తిన్నగారానీ!" అన్నాడు.

చిరునవ్వుతో అన్నాడు మనోహర్ కనుబొమ్మ లెగరేస్తూ: "అబ్బో! ఈ తాటాకు చప్పుళ్ళు నా దగ్గర చెయ్యకోయ్, నీ బండారమంతా నాకు తెలియంది కాదులే."

"ఏమిటోయ్ నీకు తెల్సింది? వంకాయపుల్సు... నేనేం దొంగనా, పోకిరీనా, ఏమిటి నీకు తెల్సింది? తెల్సిందిట మహా తెల్సు" అన్నాడు మీదికిపోతూ గద్దిస్తూ.

"శబాష్! అంత వళ్ళు తెలియకుండాపోతే ఎలా మరి? నీ ముత్యాలు తెంపుకుపోయినానా నేను? ఒక్కచూపుచూశాను, అంతే. పోనీవోయ్—నీది నీకే వుండనీ, నేను పోతున్నాను...కాని గురూ, అంత ఏకాంతం మంచిదికాదు. ప్రమాదంసుమా!" అన్నాడు వేళాకోళంగా.

"గెటవుట్! నోటికొచ్చిందల్లా ప్రేలకు. నా గది, నా యిష్టం. ఎలా అంటే అలాచేసుకుంటాను. నీ అబ్బముల్లెకాదు."

పోయేవాడు ఆగి వెనక్కితిరిగాడు మనోహర్. గంభీరమైన మంద్రస్వరంలో అన్నాడు, "షటప్. తండ్రితాతల ప్రసక్తి తేకు. పళ్ళు రాలిపోతై, జాగ్రత్త... దెబ్బకు పొగరుదిగిపోవాలి మళ్ళీ."

ఎగిరి మనోహర్ మీద కలియబడ్డాడు నిరంజన్, "ఏమిట్రా, పొగరు దింపుతావా...బ్రూట్ ..." అంటూ.

ఈ ఛీత్కార హుంకారాది కోలాహలానికి, యథావిధిగా నలుగురూ పోగైనారు విడిపించారు. అందరూ అడగటం మొదలెట్టారు, "ఏమిటోయ్, ఏంసంగతి? ఎందుకొచ్చింది కొట్లాట?"

"మంచిది, చూస్తాను. నీపని చెప్తాను" అంటూ పెద్దఅంగల్తో దాటిపోయాడు మనోహర్ సమయం బాగాలేదని చూచి.

సహాధ్యాయులెంత తరచి అడిగినా పోట్లాటకు కారణమేమిటో చెప్పనేలేదు నిరంజన్.

* * *

ఈ ఘటన జరిగి పదిహేను ఇరవై రోజులైంది. శేఖర నిరంజనుల మైత్రిమాత్రం ఎప్పటివలెనేవుంది.

శేఖర్ వచ్చినా ఈ ప్రసక్తియే లేదు. నిరంజన్ అతణ్ణి వుడికించడానికి కిటికీ దగ్గరికి పోయి ఎగా చూస్తాడు. చంద్రశేఖర్ నిశ్శబ్దంగా వెళ్ళిపోతాడు.

ఆనాడు ఆదివారం. మధ్యాహ్నసమయం తలుపు దగ్గరగాలేసి ఇటు నిరంజన్ భోజనానికి వెళ్ళాడు. అటు మనోహర్ వచ్చాడు. అటూ ఇటూ చూసి, తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించాడు. సరాసరి కిటికీదగ్గరికే పోయినాడు. ముందు కాసేపు పరికించాడు. తర్వాత మెల్లగా కిటికీ తలుపు తెరిచాడు. చొక్కా జేబులోంచి ఒక కంకరరాయి తీశాడు. చటుక్కున ఎదుటి గదిలోకి విసరి వెంటనే కిటికీతలుపులు మూసి, బయటపడ్డాడు ద్వారం యథాపూర్వంగా దగ్గరికి లాగి.

నాలుగైదు నిమిషాల అనంతరం నిరంజన్‌వచ్చి బట్టలు మార్చుకుంటున్నాడు. బయట ఏదో కోలాహలం వినవచ్చింది. దబ్బున కిటికీ తెరచి, రోడ్డు వైపు కిందకి చూశాడు. ఎదుటిమేడ యజమాని, 'బాబుగారు' తక్షణమే పైకిచూశాడు. కఠోరంగా పలకరించాడు. "ఏమయ్యా, ఏమిటీపని? తిన్నగా ఉండదలుకోలేదా?"

నిరంజన్ గుండెలు దిగజారి పోయినై. సంగతేమిటో బోధపడలేదు. కొంపదీసి చూడడం గీడడం తెలిసిపోలేదుగదా!

నిరుత్తరుడై బిత్తరపోయి చూస్తున్న నిరంజన్‌ను మరింత ఉద్రేకంతో హెచ్చరిస్తూ సెలవిచ్చారు బాబుగారు, "పెద్దమనుషుల ఇళ్ళల్లో రాళ్ళు విసరుతావ్? ఆ! నీకు అక్కచెల్లెళ్లెవరూ లేరా ఏమిటి?"

"రాళ్ళేమిటండీ, రాయీ గీయీ నేనేం వెయ్యలేదు."

బాబుగారు ఒక కంకరరాయి చూపిస్తూ, మళ్ళీ గర్జించాడు. "అయ్! రాళ్ళేమిటంటావూ? ఏమిటిది? ఇదేమిటీ అంట. ఈ రాయి మా గదిలోంచి వచ్చింది. ఇప్పుడే ఇంతకుముందే నువ్వు విసిరితేనే వచ్చింది."

ఈసారి కొంచెం గట్టిగా అన్నాడు నిరంజన్, "నే వెయ్యలేదని చెప్తున్నాను. అన్యాయంగా ఒక పెద్దమనిషికి నేరం అంటకట్టకండి."

బాబుగారు మండిపడ్డాడు, "నువ్వా పెద్దమనిషివి. నువ్వు మొదటిరకం గుండావి. ఒకవైపున పోకిరీచేష్టలు చేసి, పైపెచ్చు కుయికుయిలాడుతావ్ ఫుండాకోర్! జ్ఞాపక ముంచుకో. వళ్ళు దగ్గిరబెట్టుకు మసలు...మళ్ళీ?"

కోపంలో వాక్యాలు పూర్తికాకుండానే, కావ్యాలు వల్లిస్తూ అరచుకుంటూ నిష్క్రమించాడాయన. మళ్ళీ విద్యార్థులంతా మూగారు నిరంజన్ చుట్టూ. నల్గురూ నాలుగు రకాలుగా అన్నారు. ఒక డన్నాడు, "బలే గురూ! బావుంది రొమాన్స్! ఎగాదిగా చూడటం రివ్వురివ్వున విసరడం. బాగుందిలే నీ కథ." మరొకడు కొంచెం చమత్కరించాడు, "లవ్ ఈజ్ బ్లైండ్ అనలేదు టోయ్? తప్పేముంది. మేఘ సందేశంలా పాషాణ సందేశం ఇదీ..."

మనోహర్ మాత్రం తను విసరిన రాయి చేయవలసినంత పని చేయలేదని అసంతృప్తిపడ్డాడు.

* * *

సుమారు పదిరోజులు గడిచినై. మరో కంకరరాయితోగాని కథ పూర్తికాదని, తగిన సమయానికి పొంచికూచున్నాడు మనోహర్. వెనుకటిలాగానే సమయం చిక్కించుకున్నాడు. ఫెడీలున రాయి విసరి, గభాలునపోయి తన గదిలో వ్రాలాడు. దబదబ పుస్తకాలు తీసుకుని చకచక కాలేజికి నడిచాడు.

భోజనం ముగించుకువచ్చి నిరంజన్ ఆదరాబాదరా కాలేజికి తయారౌతున్నాడు. ఇంతలోనే తన గదికే వచ్చిపడ్డారు బాబుగారు మరో మనిషిని కూడా వెంటబెట్టుకొని.

"ఏమయ్యా! నీ రౌడీ వ్యవహారం మానవన్న మాట. మంచిది. పద, మా ప్రిన్సిపాల్ దగ్గరికి. ఇక నిన్ను వదిలేది లేదు. విద్యార్థిని గనుక సరిపోయింది. చర్మం తీసి పాతిపెట్టేవాణ్ణి" అన్నాడు ఆవేశంలో, చిందులు తొక్కుతూ.

ముందు నిరంజన్‌కు మాటే రాలేదు. తుదకు తమాయించుకుని అన్నాడు, "ఏమండీ మతి చెడి మాట్లాడుతున్నారా? అవసరంగా పెద్దమనిషిని పట్టుకుని మాటిమాటికీ ఏమిటీ ఆగడం? ఎవడో రాయివేశాడు, నా గది ఎదురుగా వుంది గాబట్టి

నామీద అనుమానించారు: ఏదో పోనీలే అని ఆనాడు ఊరుకున్నాను. అది మీకు అలుసయి పోయింది!"

ఎదుటివాళ్లు హెచ్చిపోయేటప్పుడు మనం కాస్త తగ్గిపోవడం ఎందుకైనా మంచిదనే విశ్వాసంగలవాడు గనుక బాబుగారు కోపం ఆపు అంటూ అన్నాడు, "పదపద అంతా తేల్తుందిగా. ఆ మీ ప్రిన్సిపాల్ ముందే చెప్తువుగాని."

"పదండి. నన్నేంచేస్తాడు! తలగొట్టి మొలే స్తాడా? ఏమీ చెయ్యనివాడికి నాకేంభయం."

ఐదునిమిషాల్లో వాదిప్రతివాదులు ప్రిన్సిపాల్ బంగళా చేరారు. వీరివెంట ఒకచిన్నగుంపు కదలి వెళ్ళింది. న్యాయవిచారణ జరిగింది. విద్యార్థుల సాక్ష్యాలు తీసుకున్నాడు ప్రిన్సిపాల్. మనోహర్ ముందుకువచ్చి నివేదించాడు, "సార్! ఇతడికి ఎప్పుడూ బాబుగారి ఇంటిస్త్రీలను చూడడమే పని. నేను ఎన్నోసార్లు చూచి మందలించాను. ఈ విషయంలో ఇతని పేరు హాస్టలంతా మోగి పోయింది."

ఇంకొకడన్నాడు, "అవునండి. చంద్రశేఖర్ కూడా తగదని ఒకటి రెండుసార్లు మందలించాడు."

ప్రిన్సిపాల్ అన్నాడు, "చంద్రశేఖర్ ఎక్కడ వున్నాడు? పిలవండి."

చంద్రశేఖర్ ఎక్కడా లేడు. నిరంజన్‌కు వ్యతిరేకంగా సాక్ష్యమివ్వలేడు. అబద్ధం చెప్పలేడు. అందుచేత సమయానికి లేకుండా పోయాడు.

"సరే, చాలు. ఉన్న సాక్ష్యమే చాలు. చంద్రశేఖర్ అవసరమే లేదు" అంటూ బాబుగారి వైపు తిరిగి అన్నాడు ప్రిన్సిపాల్. "ఇక తమరు దయచేయండి ఇతణ్ణి తగినరీతిని శిక్షిస్తాను."

"చిత్తం! దయచేసి అతణ్ణి తప్పక ఆ గదినించి తొలగించాలి."

"గదినుంచే కాదు. హాస్టలునుంచీ, కాలేజి నుంచీకూడా తొలగిస్తున్నాను."

నిరంజన్ శాశ్వతంగా కాలేజికి స్వస్తిచెప్పాడు. ఎవ్వరికీ కనపడకుండా, ఎందుకో తెలియని అపరాధానికి, నగరానికి వీడ్కోలు పలికాడు.

* * *

ఒక సంవత్సరం తర్వాత చంద్రశేఖర్ ఏదో పనిమీద వేరే పట్టణానికి వెళ్ళాడు. నిరంజన్ అక్కడే వుంటున్నాడని అతనికి తెలియదు దైవికంగా ఒక హోటల్లో ఇద్దరూ తటస్థపడ్డారు.

శేఖర్ అడిగాడు, "చెప్పవోయ్, ఏంచేస్తున్నావిక్కడ?"

"బ్యాంకు గుమాస్తాగా వుంటున్నాను...ఏం అనుకున్నాను, ఏంజరిగింది చివరికి! తానొకటి తలిస్తే దైవమొకటి తలిచాడు. బి. ఏ. ప్యాసై లాయర్ ఔదామనుకునేవాణ్ణి. ఇంతకూ అదృష్టంలో వుండాలిగా!"

"నిజంగా, ఆ కంకరరాళ్ళు నీవు విసరలేదు కదూ!"

"ఆ పరమేశ్వరుడే సాక్షి. అసలెన్నడూ కిటికీ తెరువనైనా లేదు. రాళ్లు వేస్తానా? అలా చేయటం ఘోరపాపం అనుకునేవాణ్ణి. ఆ రాళ్లు విసరడం బహుశా మనోహర్ పనే అనుకుంటానోయ్. తెలుసుగా నీకా కథ అంతా?"

"అవునౌను. నీకు విరుద్ధంగా సాక్ష్యం చెప్పలేక, అబద్ధమాడలేక తప్పించుకు పోయినాను."

"అవును శేఖర్! స్నేహం పాటించావు నువ్వు."

"నేను వద్దని చెప్తుండేవాణ్ణి. తప్పుల్లో మంచి తప్పులనీ, పాపాల్లో చెడుకానివనీ ఉండవు. నీ తర్కం నీదే కాని నామాట విన్నావుకావు. ఇప్పుడయినా అదికూడా పాపమేనని ఒప్పుకుంటావా?"

"ఆహా! నిస్సందేహంగా! ఇంకానా? పాపమే కాకపోతే ఇలాంటి ఫలితం ఎందుకు కల్గుతుంది. మనోహర్‌తో శత్రుత్వం, ఆ లంకా కాండ, కాలేజీకి ఉద్వాసం అన్నీవచ్చేయి. చెడుపనికి చెడే ఫలితం; ప్రతీపనికీ ఫలితం అనివార్యం- ముందు వెనుకలు కావచ్చు- అంతే. అది నా అనుభవం."

(శ్రీ కౌశిక్ హిందీ కథకు సంక్షిప్త స్వేచ్ఛానువాదం.)

---

వెనకపాటునుండి వచ్చి స్నేహితురాలి కళ్లు మూసి, "ఎవరో పోల్చుకో చూద్దాం. మూడు ఛాన్సులిచ్చాను. సరిగా పోల్చుకోకపోతే బలవంతాన ముద్దు పెట్టుకుంటాను!" అన్నాడు యువకుడు. యువతి వరసగా "నన్నయా, పెద్దనా, శ్రీనాదుడా!"అని పేరు చెప్పింది.